క్లుప్తంగా

వాహనాల తనిఖీ



వాహనాన్ని తనిఖీ చేస్తున్న అర్బన్ సీఐ

పులివెందుల రూరల్ : పట్టణంలోని పార్లపల్లె రింగురోడ్డు సమీపంలో శుక్రవారం సాయంత్రం అర్బన్ సీఐ చాంద్‌బాషా వాహనాల తనిఖీ కార్యక్రమం చేపట్టారు. ముఖ్యంగా వాహనదారులు తమ వాహనాలకు సంబంధించిన రికార్డులు, లైసెన్స్‌లు కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

నేడు యోగా డెమో కార్యక్రమం

పులివెందుల టౌన్ : పట్టణంలోని ముద్దనూరు రోడ్డులో ఉన్న వైఎస్సార్ క్రీడా ప్రాంగణంలో శనివారం యోగా డెమో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ రాముడు తెలిపారు. ప్రభుత్వ చేపట్టిన నెల రోజుల యోగా కార్యక్రమంలో యోగా డెమో కార్యక్రమం చేపట్టడం జరిగిందని, ఈ కార్యక్రమానికి పుర ప్రముఖులు, సచివాలయ సిబ్బంది, పట్టణ ప్రజలు హాజరు కావాలన్నారు.

సబ్ జైలు ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా గంగాధర్



పులివెందుల రూరల్ : పులివెందుల సబ్‌జైలు ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా డి.గంగాధర్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. కొండాపు రం మండల నివాసి అయిన డి.గంగాధర్ 2018లో ఎస్‌ఐగా ఎంపికై మొదటిగా గుంటూరు జిల్లాలో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం పలు చోట్ల పనిచేస్తూ కమలాపురం సబ్ జైలు సూపరింటెండెంట్‌గా బదిలీ అయ్యారు. గతంలో ఉన్న పులివెందుల సబ్ జైల్ సూపరింటెండెంట్ అయ్యవారురెడ్డి బదిలీ అయ్యారు.

విద్యార్థులకు చెక్కుల పంపిణీ

ముద్దనూరు : మండలంలో పదవ తరగతి పరీక్షల్లో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు చెక్కులను శుక్రవారం మండల విద్యాశాఖాధికారి నాగేశ్వరరావు నాయక్ పంపిణీ చేశారు. ప్రభుత్వం అందించిన రూ.20వేల చెక్కులను వైష్ణవి, సుజిత, తేజేష్, కీర్తన, నవ్యలకు అందజేసినట్లు ఆయన తెలిపారు.

ప్రమాదకరంగా ఇనుప చువ్వలు



రోడ్డుపై ప్రమాదకరంగా ఉన్న ఇనుప చువ్వలు

పులివెందుల రూరల్ : పాత బస్టాండు సమీపంలోని రమణప్ప సత్రంబడి పాఠశాల ఎదురుగా ఉన్న ప్రధాన రహదారిపై ఇనుప చువ్వలు ప్రమాదకరంగా ఉన్నాయి. పాదాచారులు, వాహనదారులు ఇబ్బందులు పడాల్సివస్తోంది. ఇనుప చువ్వలు రోడ్డుపైకి ఉండటంతో ప్రమాదాలు జరుగుతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుపై ఇనుప చువ్వలు లేకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

చలివేంద్రం వద్ద కుండలు మాయం



చలివేంద్రంలో మాయమైన కుండలు

పులివెందుల రూరల్ : పులివెందుల ప్రాంతంలో వేసవి సందర్భంగా విద్యుత్ సామాజిక సంఘం ఆధ్వర్యంలో అంబకపల్లె రోడ్డులో ఉన్న విద్యుత్ డివిజన్ కార్యాలయం ఎదుట చలివేంద్రం ఏర్పాటు చేశారు. అక్కడ కొద్దిరోజుల వరకు నీరు అందించారు. అయితే చలివేంద్రం వద్ద ఏర్పాటు చేసిన కుండలు మాయం కావడంతో విద్యుత్ ఉద్యోగులు విస్మయం చెందుతున్నారు.

విధి నిర్వహణలో డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలి

కడప కోటిరెడ్డిసర్కిల్: డ్రైవర్లు విధి నిర్వహణలో నిరంతరం అప్రమత్తంగా ఉంటూ ప్రమాద రహిత డ్రైవింగ్ చేయాలని కడప ట్రాఫిక్ సీఐ జావీద్ పిలుపునిచ్చారు.కడప ఆర్టీసీ రీజినల్ మేనేజర్ కార్యాలయ సభా భవనంలో ఆర్టీసీ డ్రైవర్లకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ జావీద్ మాట్లాడుతూ ఆర్టీసీ సంస్థకు ప్రమాద రహిత సంస్థగా పేరు ఉందన్నారు. బస్సు నడిపే సమయంలో అన్ని అంశాలను పరిగణలోకి తీసుకోవాలన్నారు. చిన్న పొరపాట్లే ప్రమాదాలకు కారణమవుతాయన్న విషయాన్ని గుర్తించుకోవాలని సూచించారు. అనంతరం పులివెందుల డిపో మేనేజర్ రామకృష్ణ ఇంధన పొదుపుపై పంచసూత్రాలపై సలహాలు, సూచనలు చేశారు. మధ్యాహ్నం డ్రైవర్లను బ్లాక్ స్పాట్‌పై అవగాహన కల్పించారు. తొలుత ఓం శాంతి సంస్థ ప్రతినిధి ప్రదీప్ అక్కయ్య డ్రైవర్లచే ధ్యానం చేయించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ అధికారులు కృష్ణారెడ్డి, రామయ్య పాల్గొన్నారు.

చంద్రన్న మహిళా మార్ట్ ఇక లేనట్లేనా



పులివెందులలో మూతబడిన చంద్రన్న మహిళా మార్ట్

పులివెందుల రూరల్ : అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి మహిళను లక్షాధికారిని చేయాలని డ్వాక్రా మహిళలకు మార్కెట్ ధరలకంటే తక్కువ ధరలకే నిత్యావసర సరుకులను అందించే విధంగా జగనన్న మహిళా మార్ట్‌ను ఏర్పాటు చేశారు. ఈ మహిళా మార్ట్ ద్వారా డ్వాక్రా సంఘాల్లోని సభ్యులకు బయట మార్కెట్‌లో కంటే తక్కువ ధరలకే నిత్యావసర సరుకులు అందించేవారు. డ్వాక్రా మహిళలు కూడా జగనన్న మహిళా మార్ట్‌లోనే తక్కువ ధరలకే నిత్యావసర సరుకులు తీసుకునేవారు. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జగనన్న మహిళా మార్ట్‌ను చంద్రన్న మహిళా మార్ట్‌గా పేరు మార్చారు. ప్రభుత్వం పేరు మార్చారు కానీ చంద్రన్న మహిళా మార్ట్‌లో ఎటువంటి నిత్యావసర సరుకులు అందుబాటులో ఉంచలేకపోయారు. దీంతో చంద్రన్న మహిళా మార్ట్ మూతబడింది. దీంతో చంద్రన్న మహిళా మార్ట్ ఇక లేనట్లేనని డ్వాక్రా సంఘాల మహిళలు చర్చించుకుంటున్నారు. మహిళల కోసం చంద్రబాబునాయుడు చెప్పిన అబద్ధపు హామీలు కూడా అమలు చేయలేకపోయారని, చంద్రన్న మహిళా మార్ట్‌ను అయినా తెరిపించాలని మహిళలు కోరుతున్నారు.

రేపు ప్రముఖ వైద్య నిపుణుల రాక

పులివెందుల : పట్టణంలోని స్థానిక భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(గంగిరెడ్డి ఆసుపత్రి)లో ఆదివారం ప్రముఖ వైద్య నిపుణులు రానున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. ప్రముఖ న్యూరో సర్జన్ డాక్టర్ క్రాంతికుమార్ మెదడు, వెన్నముక, నరాలు, తిమ్మిర్లు, వంటి ఒళ్లు నొప్పులకు వైద్య చికిత్సలు అందిస్తారన్నారు. కర్నూలు విశ్వభారతి ఆసుపత్రి నుంచి ప్రముఖ గుండె జబ్బుల వైద్య నిపుణులు డాక్టర్ హితేష్‌రెడ్డి గుండె సంబంధిత జబ్బులకు వైద్య చికిత్సలు అందిస్తారన్నారు. ప్రముఖ క్యాన్సర్ వ్యాధి నిపుణురాలు డాక్టర్ డి.నిహారిక క్యాన్సర్ అవగాహన మరియు స్క్రీనింగ్, క్యాన్సర్ రోగులను క్రమ తప్పకుండా అనుసరించడం మరియు ఇతర క్యాన్సర్ సంబంధిత సంప్రదింపులు ఉంటాయన్నారు. ఈ నరాల, గుండెజబ్బుల, క్యాన్సర్ సమస్యలతో బాధపడుతున్నవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అలాగే ఆసుపత్రిలో నూతనంగా డయాలసిస్ సెంటర్ ప్రారంభించడం జరిగిందని, కిడ్నీ సేవలు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటాయన్నారు. మరిన్ని వివరాలకు 9963170177, 08568286189 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

మండల సమగ్రాభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించండి



మాట్లాడుతున్న ఎంపీపీ వరలక్ష్మి

పెండ్లిమర్రి : మండల సమగ్రాభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రతి ఒక్కరు సహకరించి మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలని ఎంపీపీ వరలక్ష్మి తెలిపారు. స్థానిక ఎంపీడీవో సభా భవనంలో శుక్రవారం ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో నెలకొన్న సమస్యలను తమ దృష్టికి తీసుకవస్తే వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. అనంతరం మండల స్థాయి అధికారులు ఆయా శాఖలకు సంబంధించిన ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ బాలయ్య, ఎంపీడీవో జగన్ మోహన్‌రెడ్డి, తహసీల్దార్ అనురాధ, మండలస్థాయి అధికారులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శిలు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గుచూపాలి



రైతులకు సూచనలు ఇస్తున్న జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ ప్రవీణ్‌కుమార్

వల్లూరు : రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గు చూపాల్సిన అవసరం ఎంతైనా వుందని ప్రకృతి వ్యవసాయ విభాగం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. మండలంలోని పెద్దపుత్త గ్రామంలో రైతులు సాగు చేసిన పీఎండీఎస్ నవధాన్య సాగును శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరిలో ప్రధాన పంట సాగుకు ముందు నవధాన్యాలను సాగు చేసుకోవడం వలన అనేక లాభాలు ఉన్నాయన్నారు. దీని వలన ప్రధానంగా భూమి సారవంతంగా మారడంతోపాటుగా ప్రధాన పంటకు వచ్చే అధిక తెగుల్లను అరికట్టవచ్చునని వివరించారు. ఎరువుల వాడకాన్ని తగ్గించుకోవడంతో పాటు అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. ఎన్నో ప్రయోజనాలు వున్నందున రైతులు ప్రధాన పంటల సాగుకు ముందు నవధాన్యాలను సాగు వేసుకోవాలని సూచించారు. వరి సాగులో ఘన జీవామృతం, ద్రవ జీవామృతంను తప్పనిసరిగా వాడుకోవాలని సూచించారు. వరిలో సరైన యాజమాన్య పద్ధతులను పాటిస్తే చాలావరకు పురుగులు, తెగుళ్ల బారి నుంచి పంటను రక్షించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో రైతులు రాఘవరెడ్డి, బాలిరెడ్డి, ప్రొఫెసర్ భరత్‌కుమార్‌రెడ్డి, ఎస్ఎఫ్ఏ నరసింహారెడ్డి, ఎంటీ వెంకటరామిరెడ్డి, యూనిట్ ఇన్‌చార్జి ఓబులయ్య, చంద్రశేఖర్, ఇంటర్నల్ కమ్యూనిటీ రీసోర్స్ పర్సన్స్ విజయలక్ష్మి, ఓబులమ్మ పాల్గొన్నారు.

విద్యార్థినికి నగదు అందజేత



ప్రతిభ చూపిన విద్యార్థినికి నగదును అందిస్తున్న శివశంకర్‌రెడ్డి

వేంపల్లె : మండలంలోని పాములూరు జిల్లా పరిషత్ పాఠశాలలో పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన అలవలపాడు గ్రామానికి చెందిన కేశవరెడ్డి కుమార్తె అమరావతికి దాత శివశంకర్‌రెడ్డి శుక్రవారం ప్రధానోపాధ్యాయురాలు సౌభాగ్యలక్ష్మి చేతుల మీదుగా రూ.5 వేలు అందజేశారు. హెడ్మాస్టర్ మాట్లాడుతూ పాములూరు ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు శివశంకర్‌రెడ్డి 1988 నుంచి ప్రోత్సాహక బహుమతి కింద నగదును అందిస్తున్నారన్నారు. దాత మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో మంచి ఉపాధ్యాయులు ఉన్నారని, ప్రతి విద్యార్థి ప్రతిరోజు పాఠశాలకు వచ్చి విద్యనభ్యసించాలన్నారు. కార్యక్రమంలో జేవీవీ జిల్లా కార్యవర్గ సభ్యుడు గంగాధర్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సబ్సిడీతో వ్యవసాయ డ్రోన్ పరికరం పంపిణీ



యువ రైతులకు సబ్సిడీ డ్రోన్ పరికరాన్ని అందిస్తున్న ఏడీఏ, ఏఓ

లింగాల : వ్యవసాయాన్ని సులువుగా, లాభదాయకంగా మార్చే దిశగా ప్రభుత్వం సబ్సిడీతో వ్యవసాయ డ్రోన్ పరికరాన్ని అందిస్తోందని వ్యవసాయ శాఖ ఏడీ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం మండలంలోని ఇప్పట్ల గ్రామంలో శ్రీలక్ష్మీవెంకటేశ్వర రైతు మిత్ర గ్రూపునకు చెందిన యువ రైతులకు ఆయన ఏఓ రమేష్‌తో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో డ్రోన్ టెక్నాలజీతో మందుల పిచికారి తక్కువ సమయంలో ఎక్కువ విస్తీర్ణంలో కవర్ చేస్తుందని, కేవలం 7 నిమిషాల్లోనే ఎకకరా పొలంలో పిచికారి చేసుకోవచ్చునన్నారు. వ్యవసాయంలో యువ రైతులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం రాయితీ అందిస్తోందన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో రైతులు, ఆర్ఎస్‌కే సిబ్బంది పాల్గొన్నారు.

పీఎం సూర్య ఘర్ యోజనపై అవగాహన కల్పించాలి



మాట్లాడుతున్న ట్రాన్స్‌కో డీఈ వెంకటేశ్వర్లు

పెండ్లిమర్రి : ప్రధాన మంత్రి సూర్య ఘర్ యోజన పథకం గురించి గృహ వినియోగదారులకు అవగాహన కల్పించాలని ట్రాన్స్‌కో డీఈ వెంకటేశ్వర్లు తెలిపారు. శుక్రవారం మండలంలోని మిట్టమీదపల్లె విద్యుత్ సబ్‌స్టేషన్‌లో పీఎం సూర్య ఘర్ యోజన పథకం గురించి వినియోగదారులకు, సోలార్ గుత్తేదారులకు, సిబ్బందికి అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గృహవినియోగదారులు ఇంటి పైకప్పుమీద సోలార్ రూఫ్ టాప్ అమర్చుకుని వినియోగించుకోవచ్చన్నారు. విటి వల్లన విద్యుత్ బిల్లు చాలా తక్కువగా వస్తుందన్నారు. పర్యావరణానికి హానిచేయని సౌర శక్తి వాడకాన్ని ప్రజలంతా అలవాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ట్రాన్స్‌కో ఏఈ జయరామయ్య, జూనియర్ ఇంజనీర్లు నవనీతబాయ్, వెంకటశివ పాల్గొన్నారు.

విద్యార్థి బ్యాంకు ఖాతాకే తల్లికి వందనం

కడప రూరల్: ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఎస్సీ విద్యార్థి బ్యాంకు ఖాతాలకే తల్లికి వందనం నిధులు జమవుతాయని జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ సరస్వతి తెలిపారు. ఎస్సీ విద్యార్థులు సమీప పోస్టాఫీసులో బ్యాంకు ఖాతా తెరచి, మీ ఆధార్ నెంబర్‌కి ఎన్‌పీసీఐ పోర్టల్‌కు లింకు చేసుకోవాలని పేర్కొన్నారు. ఒకవేళ విద్యార్థికి ఇదివరకే బ్యాంకు ఖాతా ఉన్నట్లయితే ఆ అకౌంట్‌కు ఎన్‌పీసీఐ లింక్ చేసుకోవాలని తెలిపారు.

ఈకేవైసీ తప్పని సరిగా చేయించుకోవాలి



ఈకేవైసీని తనిఖీ చేస్తున్న వ్యవసాయ అధికారి శ్యామ్‌బాబు

వీరపునాయునిపల్లె : అన్నదాత సుఖీభవ, ప్రధాన మంత్రి కిసాన్ పథకాలకు సంబంధించి ప్రతి రైతు ఈకేవైసీ చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి శ్యామ్‌బాబు తెలిపారు. శుక్రవారం మండలంలోని తలపనూరు రైతు సేవా కేంద్రంలో నిర్వహిస్తున్న ఈకేవైసీ కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేసి మాట్లాడారు. అన్నదాత సుఖీభవ, ప్రధానమంత్రి కిసాన్ పథకాలకు అర్హులైన వారు రైతుసేవా కేంద్రాలకు వెళ్లి ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. ఆధార్‌కార్డు నెంబర్ లేదా పట్టాదారు పాసుపుస్తకం ఖాతా నెంబరు ద్వారా బయోమెట్రిక్ ద్వారా ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. మండల వ్యాప్తంగా 5786 మంది రైతుల వివరాలు వ్యవసాయ సహాయకుల లాగిన్‌లోకి వచ్చాయన్నారు. ఈనెల 20వ తేదీలోపు పూర్తి చేయించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



శిబిరానికి వచ్చిన రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

కమలాపురం : పట్టణంలోని దర్గా-ఏ-గఫారియా, జహీరియా నందు నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. శుక్రవారం కడప నగరంలోని ఫాతిమా ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ హాస్పిటల్ సెక్రటరీ జవాద్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సల్మాన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి సమీప ప్రాంతాల నుంచి వచ్చిన 200 మంది రోగులకు వైద్య పరీక్షలు అందజేశారు. శిబిరానికి వచ్చిన రోగులకు జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, గైనకాలజీ, ఆర్థోపెడిక్స్, పిడియాట్రిక్స్, ఈఎన్‌టీ, డెంటల్, చర్మ వ్యాధులు, ఊపిరి తిత్తుల వ్యాధులు, కంటి సమస్యలకు సంబంధించిన వ్యాధులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కడప నగరంలోని ఫాతిమా ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ హాస్పిటల్‌లో అన్ని రకాల రోగాలకు వైద్య చికిత్సలు అందిస్తామని, రోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. కార్యక్రమంలో హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

పులివెందుల రూరల్ : పట్టణంలోని ప్రభుత్వాసుపత్రి సమీప ప్రాంతాలలో శనివారం ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏఈ జగదీశ్వరరెడ్డి తెలిపారు. పట్టణంలోని 33/11 కె.వి. ప్రభుత్వాసుపత్రి సబ్‌స్టేషన్‌లో మెయింటెన్స్ ఉన్న సందర్భంగా విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామన్నారు. ఈ విషయాన్ని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

ముద్దనూరు : మండలవ్యాప్తంగా నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం వుంటుందని ఏపీఎస్పీడీసీఎల్ ఏఈ శ్రీనివాసరెడ్డి శుక్రవారం తెలిపారు. విద్యుత్ మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 6 గంటలనుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు అన్ని సబ్‌స్టేషన్‌ల పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం వుంటుందని, వినియోగదారులు గమనించాలని ఏఈ కోరారు.

జమ్మలమడుగు : జమ్మలమడుగు, ఎర్రగుంట్ల పట్టణ, మండల పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్‌శాఖ ఏడీఏ రాజగోపాల్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 9 నుంచి 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామన్నారు.

వల్లూరు (చెన్నూరు) : చెన్నూరు మండలంలో విద్యుత్ మరమ్మతుల కారణంగా శనివారం సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్‌శాఖ ఏఈ రామలింగారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మండల వ్యాప్తంగా ఉదయం 9 గంటల నుండచి మధ్యాహ్నం 1 గంట వరకు సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

పూజ ఇంటర్నేషనల్ స్కూల్‌ను రక్షించండి



ఆర్డీఓ కార్యాలయంలో వినతి పత్రం అందిస్తున్న విద్యార్థి సంఘం నాయకులు

జమ్మలమడుగు : పూజ ఇంటర్నేషనల్ స్కూల్ మాఫీయా చేతిలోనికి వెళ్లకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయం ఎదుట రాయలసీమ పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు ములపాకు ప్రతాప్‌రెడ్డి, రాయలసీమ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జగన్‌మాదిగ, స్టూడెంట్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు రంగనాయకుల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రొద్దుటూరు మండలం చౌడురు గ్రామం పరిధిలో పూజ ఇంటర్నేషనల్ స్కూల్ రాజారెడ్డి ఓ ఉన్నత ఆశయంతో నిర్మించారు. ఆయన ఆశయాలకు తూట్లు పొడుస్తూ వారి కుటుంబ సభ్యులు ఆస్తి కోసం ఆయనను హత్య చేశారు. అయితే రాజారెడ్డి వీలు నామా ప్రకారం పాఠశాలలను నిర్వహించే అనాథ పిల్లలను బెదిరించి బయటికి పంపించి ఇప్పుడు స్కూల్‌ను వారి ఆధీనంలోనికి తెచ్చుకున్నారు. గణేష్‌రెడ్డి అనే వ్యక్తి స్కూల్ డీసీని అని చెప్పుకుంటూ విద్యార్థులపై దాడులు చేయడం జరుగుతుంది. ఇతన్ని ప్రొద్దుటూరు రూరల్ స్టేషన్ అధికారులు గత బుధవారం రిమాండ్‌కు తరలించారు. గణేష్‌రెడ్డి అతని కుటుంబ సభ్యులు పూజ ఇంటర్నేషనల్ స్కూల్‌కు సంబంధించిన ఆస్తులను కొల్లగొట్టే ప్రయత్నం చేసస్తున్నారన్నారు. జిల్లా స్థాయి అధికారులు పాఠశాలలను తమ స్వాధీనంలోనికి తెచ్చుకుని నడిపించాలని డిమాండ్ చేశారు.

ఉపాధ్యాయుడికి సన్మానం

కడప ఎడ్యుకేషన్: కడప మండలం బుడ్డాయపల్లె మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాలలో పని చేస్తూ బదిలీ అయిన ఉపాధ్యాయుడు లక్ష్మికాంత్‌ను పాఠశాల విద్యా కమిటీ, ఉపాధ్యాయులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఆయన పిల్లలకు అందించిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుడు పి.నరేంద్రనాథ్‌రెడ్డి, విద్యా కమిటీ చైర్మెన్ మల్లేశ్వరి, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.